## మాజీ ఎంపీటీసీకి ఎమ్మెల్సీ తాతా మధు పరామర్శ

వెంకటేశ్వర్లును పరామర్శిస్తున్న తాతా మధు

తిరుమలాయపాలెం, నవంబర్ 29: మండలంలోని పిండిప్రోలు మాజీ ఎంపీటీసీ పులుగుజ్జు వెంకటేశ్వర్లును ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు శుక్రవారం పరామర్శించారు. గురువారం రాత్రి ఆకస్మికంగా పక్షవాతానికి, అస్వస్థతకు గురై వెంకటేశ్వర్లు ఖమ్మంలోని ఓ ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న తాతా మధు.. వెంటనే సదరు ఆసుపత్రికి వెళ్లి వెంకటేశ్వర్లును పరామర్శించారు. అతడి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు వీరన్న, సీహెచ్ రాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మెగా ఫుడ్‌పార్క్‌ను తనిఖీ చేసిన సత్తుపల్లి ఎమ్మెల్యే

పరిశ్రమను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి టౌన్/ సత్తుపల్లి, నవంబర్ 29: మండలంలోని బుగ్గపాడులో ఉన్న మెగా ఫుడ్‌పార్క్‌ను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫుడ్‌పార్క్‌లోని పలు పరిశ్రమలు సందర్శించారు. జోనల్ మేనేజర్ మహేశ్వర్ ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో నూతనంగా ప్రారంభించబోయే డ్రైఫ్రూట్ పరిశ్రమను పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బుగ్గపాడు ఫుడ్‌పార్క్ అభివృద్ధికి, నూతన పరిశ్రమల ఆహ్వానానికి కృషి చేస్తామని అన్నారు.

**'సింగరేణి భూనిర్వాసితులకు న్యాయం చేయాలి'**

సింగరేణి భూనిర్వాసితులకు న్యాయం చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి కోరారు. ఈ మేరకు ఖమ్మం కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

## టెన్త్ విద్యార్థుల అల్పాహారానికి చేయూత

వితరణ నగదు అందజేస్తున్న ట్రస్టు బాధ్యులు

బోనకల్లు, నవంబర్ 29: మండలంలోని ఆళ్లపాడు ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు స్థానిక బత్తినేని చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బత్తినేని నాగప్రసాద్ – నీరజ దంపతులు ముందుకొచ్చారు. ఈ మేరకు శుక్రవారం రూ.20 వేల నగదును పాఠశాల హెచ్ఎం శ్రీలతకు అందజేశారు. ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న టెన్త్ విద్యార్థులకు అల్పాహారం అందించాలని సామాజిక కార్యకర్త బంకయ్య చేసిన విజ్ఞప్తికి స్పందించిన నాగప్రసాద్ దంపతులు స్పందించి చేయూతనిచ్చారు. ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో శాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గరికపాటి సోదరులకు తమ్మినేని పరామర్శ

ఖమ్మం రూరల్, నవంబర్ 29: ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారులు గరికపాటి వెంకట్రావ్, ఆంజనేయ ప్రసాద్‌ల తండ్రి రాఘవయ్య గురువారం మృతిచెందిన విదితమే. విషయం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం మండలంలోని కరుణగిరి ప్రాంతంలో ఉన్న రాఘవయ్య నివాసానికి వెళ్లారు. అతడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గరికపాటి సోదరులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సీపీఎం నాయకులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, బండి రమేశ్, ఎర్రా శ్రీకాంత్ పాల్గొన్నారు.

## వారం రోజులపాటు 'రామనామ సప్తాహం'

రామనామ సప్తాహంలో పాల్గొన్న భక్తులు

కూసుమంచి, నవంబర్ 29: వారం రోజులపాటు రేయింబవళ్లూ కొనసాగే హరేరామ హరేకృష్ణ రామనామ సప్తాహం కూసుమంచి మండలం కేశ్వాపురంలో శుక్రవారం ప్రారంభమైంది. వయసుతో నిమిత్తం లేకుండా గ్రామంలోని మహిళలు, పురుషులు వంతుల వారీగా సప్తాహంలో పాల్గొని రామకృష్ణుల జపాన్ని ఆలపిస్తున్నారు. స్థానిక కోదండరామస్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో భక్తులకు అన్నప్రదాసాన్ని ఏర్పాటు చేశారు.

## వైరా నదిలోని ఇసుక రీచ్ పరిశీలన

ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మధిర రూరల్, నవంబర్ 29: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు మధిర నియోజకవర్గంలో ఇసుక పంపిణీకి మార్గం సుగమమైంది. ఈ మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. మండలంలోని చిలుకూరు గ్రామం వద్ద ఉన్న వైరా నదిలోని ఇసుక రీచ్‌ను స్థానిక ప్రజలతో కలిసి అధికారులు శుక్రవారం పరిశీలించారు. తహసీల్దార్ రాంబాబుతోపాటు మైనింగ్, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 'ధాన్యం, పత్తి కొనుగోళ్లలో జాప్యం వద్దు'

కూసుమంచి (నేలకొండపల్లి), నవంబర్ 29: ఏఎంసీ పరిధిలో రైతులు పండించిన వరి, పత్తి పంటల కొనుగోళ్లలో జాప్యం చేయొద్దని మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నెపూసల సీతారాములు సూచించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. స్థానిక ఏఎంసీలో శుక్రవారం జరిగిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 4,70,000 టన్నుల ధాన్యాన్ని, 7,600 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశామని తెలిపారు. ఏఎంసీ వైస్ చైర్మన్ కొండపర్తి సురేశ్, ఎంపీడీవో ఎర్రయ్య, కార్యదర్శి నాగేశ్వరి, ఏడీఏ సరిత తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు 'విన్‌ఫీల్డ్' విద్యార్థి ఎంపిక

విద్యార్థిని అభినందిస్తున్న స్కూల్ డైరెక్టర్లు

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 29: నగరంలోని విన్‌ఫీల్డ్ పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థి పీ.అలోక్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించినట్లు స్కూల్ డైరెక్టర్ గద్దె పుల్లారావు తెలిపారు. జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో అండర్–10 విభాగంలో లాంగ్‌జంప్‌లో సత్తా చాటిన సదరు విద్యార్థి.. డిసెంబర్ 1న జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన అలోక్‌ను డైరెక్టర్లు మన్నె కిషోర్‌కుమార్, పోలవరపు శ్రీకాంత్, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# నాణ్యమైన భోజనం అందించాలి

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రుచికరంగా తయారు చేయాలి
- కారేపల్లిలో మధ్యాహ్న భోజన తనిఖీలో అదనపు కలెక్టర్ శ్రీజ

కారేపల్లిలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

కారేపల్లి, నవంబర్ 29: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని అదనపు కలెక్టర్ శ్రీజ సూచించారు. విద్యార్థులకు రుచికరంగా తయారు చేసి ఇవ్వాలని ఆదేశించారు. కారేపల్లి మండలంలో శుక్రవారం పర్యటించిన ఆమె.. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో తయారుచేసిన మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ముందుగా వంట చేసే విధానాన్ని పరిశీలించారు. తరువాత విద్యార్థులతో కలిసి ఆమె కూడా భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భోజనం తయారీలో నాణ్యతను, శుభ్రతను పాటించాలని నిర్వాహకులను ఆదేశించారు. అంతకుముందు స్థానిక ఐకేపీ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ఆమె పరిశీలించారు. ఎంఈవో జయరాజు, ఏపీఎం పిడమర్తి వెంకన్న, ప్రధానోపాధ్యాయుడు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

### కొణిజర్లలో పరిశీలించిన ఎంపీడీవో

కొణిజర్ల, నవంబర్ 29: మండలంలోని పెద్దమునగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో రోజారాణి శుక్రవారం పరిశీలించారు. పేరెంట్స్ మీటింగ్‌లో మాట్లాడారు.

### మెనూ ప్రకారం భోజనం అందించాలి

రఘునాథపాలెం, నవంబర్ 29: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని ఖమ్మం అర్బన్ ఎంఈవో శైలజాలక్ష్మి మధ్యాహ్న భోజన ఏజెన్సీలను ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏజెన్సీల నిర్వాహకులతో సమావేశమై మిడ్ డే మీల్స్ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

ఖమ్మం అర్బన్‌లో వంట ఏజన్సీలకు సూచనలు చేస్తున్న ఎంఈవో శైలజాలక్ష్మి, కొణిజర్లలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రోజారాణి

# ఖమ్మం 'దీక్షా దివస్'లో కల్లూరు, వేంసూరు నేతలు

ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన దీక్షా దివాస్ కార్యక్రమానికి ఆ పార్టీ కల్లూరు మండలం నాయకులు హాజరయ్యారు. అక్కడి ఫొటో ఎగ్జిబిషన్‌లో భాగంగా నాడు కేసీఆర్ దీక్ష సమయంలో తీసిన చిత్రపటానికి వారు క్షీరాభిషేకం, పుష్పాభిషేకం చేశారు. బీఆర్ఎస్ కల్లూరు నాయకులు లక్కినేని రఘు, మేకల కృష్ణ, షేక్ కమిలీ, సీహెచ్ కిరణ్‌కుమార్, రామవరపు రఘు, రామవరపు ప్రసాద్, బాణోతు కృష్ణ, నేపాల్, కృష్ణ, చారుగుండ్ల సందీప్, ఎనుముల రాంబాబు, ఎనుముల శివ, అప్పారావు, వేంసూరు మండల నేతలు పగుట్ల వెంకటేశ్వరరావు, పుచ్చకాయల శంకర్‌రెడ్డి, మారోజు సురేశ్, మిరియాల ప్రసాద్, కొండపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

–పెనుబల్లి (కల్లూరు)/ వేంసూరు, నవంబర్ 29

# 'వ్యవసాయ కార్మికులకు రూ.12 వేల జీవనభృతి ఇవ్వాలి'

ఖమ్మం రూరల్ తహసీల్దార్ ఆఫీసు ఎదుట ధర్నా చేస్తున్న వ్యవస్యాయ కార్మిక సంఘం నాయకులు, సత్తుపల్లిలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఖమ్మం రూరల్/ సత్తుపల్లి, నవంబర్ 29: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం వ్యవసాయ కార్మికులకు రూ.12 వేల జీవనభృతి ఇవ్వాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బందెల వెంకయ్య డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం నాయకులతో కలిసి ఖమ్మం రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటినీ అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కిందని విమర్శించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు మలీదు నాగేశ్వరరావు, మారుతి మల్లయ్య, హనుమంతరావు, రెంటాల యాదగిరి, వెంకన్న, పూలమ్మ, బందెల లలిత, వెంకట అప్పారావు, రామదాసు తదితరులు పాల్గొన్నారు. సత్తుపల్లిలో గంటా శ్రీనివాస్, వెంకటేశ్, సున్నం కృష్ణ, సున్నం రాజారావు, కందిమళ్ల ప్రసాద్, నెక్కొండ అలివేలు పాల్గొన్నారు.

## న్యాస్ సర్వేకు సన్నద్ధం కావాలి

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 29: ఖమ్మం వెలుగుమట్ల ఉన్నత పాఠశాలను డీఏఎంవో రవికుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్)కు సన్నద్ధం కావాలని; 6, 9 తరగతుల విద్యార్థులు స్వల్పకాలాన్ని సద్వినియోగం పరుచుకోవాలని సూచించారు. టెన్త్‌లో వచ్చిన మార్పులను వివరించి, మంచి మార్కులు సాధించేందుకు సూచనలు చేశారు. హెచ్ఎం ప్రమీల, టీచర్లు పాల్గొన్నారు.

## 2 నుంచి ఇగ్నో పరీక్షలు

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 29: ఇందిరా గాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయ (ఇగ్నో) టర్మ్ ఎండ్ పరీక్షలు డిసెంబర్ 2 నుంచి ఖమ్మం కవితా మెమోరియల్ కళాశాలలో జరుగుతాయని సెంటర్ కోఆర్డినేటర్ రమణారావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని అన్నారు. హాల్‌టికెట్, ఐడీ కార్డుతో రావాలన్నారు.

# రైతు భరోసాను వెంటనే ఇవ్వాలి: సీపీఎం

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మం రూరల్, నవంబర్ 29: రైతు భరోసాను వెంటనే ఇవ్వాలని, రూ.రెండు లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్‌రోడ్డులోని తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో పెరుమళ్లపల్లి మోహన్ రావు అధ్యక్షతన జరిగిన శుక్రవారం జరిగిన సీపీఎం మండలకమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తి కావస్తున్నప్పటికీ ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బండి రమేశ్, సుదర్శన్‌రెడ్డి, ప్రసాద్, నందిగామ కృష్ణ, సంగయ్య, సుమతి, యామిని పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ నేత చేరిక

బోసిపోగు అబ్రహంను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న తాతా మధు, తక్కెళ్లపల్లి

ఖమ్మం, నవంబర్ 29: దీక్షా దివస్ రోజున కాంగ్రెస్ నాయకుడు ఒకరు బీఆర్ఎస్‌లో చేరారు. చింతకాని మండలం నాగులవంచకు చెందిన కాంగ్రెస్ నాయకుడు బోసిపోగు అబ్రహం.. ఆ పార్టీ ప్రజావ్యతిరేక విధానాలపై విసుగు చెందాడు. ఈ క్రమంలో ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయంలో జరుగుతున్న దీక్షా దీవస్‌లో శుక్రవారం ఆయన బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ ముఖ్య నేతలు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, తాతా మధుసూదన్, సంద్ర వెంకటవీరయ్య, లింగాల కమల్‌రాజు తదితరులు ఆయన గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అబ్రహం మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లలో రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగించిన ఘనత కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు.

## 'పురం'లో గాయత్రి మహాయజ్ఞం

రఘునాథపాలెం, నవంబర్ 29: ఖమ్మం నగర అఖిల విశ్వ గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో శుక్రవారం పాండురంగాపురం శ్రీరామలింగేశ్వర ఆలయంలో 24 కుండలములతో గాయత్రి మహాయజ్ఞం జరిగింది. కేఎంసీ మేయర్ నీరజ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, ఆలయ చైర్మన్ శీలం శ్రీను, ఉపాధ్యక్షుడు చిలుమూరు కోటి, ప్రధాన కార్యదర్శి సామినేని గంగాధర్, కోశాధికారి రాజేశ్, కమిటీ బాధ్యులు చిన్న మల్లేశం, కుర్రా మాధవరావు, బోయిన సురేశ్, రమేశ్, తీగల వెంకటేశ్వర్లు, పంపుల శ్రీను, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

గాయత్రి మహాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు

## 'ఆధునిక పద్ధతిలో యాసంగి వరి సాగు చేయండి'

డ్రమ్ సీడర్‌పై అవగాహన కల్పిస్తున్న ఏవో

కూసుమంచి, నవంబర్ 29: ఈ యాసంగిని ఆధునిక పద్ధతిలో సాగు చేయాలని ఏవో వాణి సూచించారు. ఇందుకోసం డ్రమ్ సీడర్, నేరుగా వెదజల్లే పద్ధతి, సీడ్ కం ఫెర్టిలైజర్ విధానాలను అవలంబించాలని అన్నారు. అలా చేస్తే 15 రోజులకు ముందే పంట చేతికి వస్తుందని, ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి ఖర్చు ఆదా అవుతుందని వివరించారు. మండలంలోని ఈశ్వరమాధారం, మద్దివారిగూడెం గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఆమె.. బాణోత్ నందా అనే రైతు పొలంలో వెదజల్లే పద్ధతిలో, గుగులోత్ రవీంద్రనాయక్ అనే రైతు పొలంలో డ్రమ్ సీడర్ విధానంలో విత్తనాలు నాటారు. ఏఈవో రవీందర్ పాల్గొన్నారు.

## 'పది' విద్యార్థులకు గణిత ప్రతిభా పాఠవ పరీక్షలు

వేంసూరు: ప్రశంసాపత్రాలు చూపిస్తున్న విద్యార్థులు

వేంసూరు/ వైరా టౌన్/ పెనుబల్లి, నవంబర్ 29: శ్రీనివాసా రామానుజన్ జయంతి సందర్భంగా వేంసూరు, వైరా, పెనుబల్లి మండలల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల టెన్త్ విద్యార్థులకు మండలస్థాయి ప్రతిభాపాఠవ పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేంసూరు హెచ్ఎం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని ఎనిమిది ఉన్నత పాఠశాలల నుంచి 29 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. ఇందులో అధిక శాతం మంది విద్యార్థులు ప్రతిభ చూపినట్లు వివరించారు. లవైరాలో నిర్వహించిన గణిత ప్రతిభా పాఠవ పరీక్ష పేపర్లను మండల మోడల్ ఆఫీసర్ మాధవరావు ఆవిష్కరించారు. పెనుబల్లిలో ఎంఈవో సత్యనారాయణ, ఉపాధ్యాయులు భాస్కర్, మహేశ్, సైదారావు, మూర్తి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనారాయణ కళాశాల విద్యార్థుల విహారయాత్ర

సత్తుపల్లి టౌన్, నవంబర్ 29: సత్తుపల్లిలోని శ్రీనారాయణ కళాశాల విద్యార్థులు శుక్రవారం పాములేరు విహారయాత్రకు వెళ్లారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ నల్లని చక్రవర్తుల రామకృష్ణ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులకు విజ్ఞానం పెరగడంతో పాటు వినోదం కూడా కలుగుతుందని అన్నారు. కళాశాల డైరెక్టర్ వనమారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాజాకృష్ణ, కృష్ణారెడ్డి, నవకుమార్, నాగరాజు, మోహన్‌రావు పాల్గొన్నారు.

## రూ.36 కోట్ల లాభాల్లో ఖమ్మం రీజియన్: ఆర్ఎం

బస్టాండ్‌ను పరిశీస్తున్న ఆర్ఎం

సత్తుపల్లి టౌన్, నవంబర్ 29: ఆర్టీసీ ఖమ్మం రీజియన్ రూ.36 కోట్ల లాభాల్లో ఉందని ఆ సంస్థ ఖమ్మం రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) సరిరాంనాయక్ తెలిపారు. ఈ రీజియన్‌లోని అన్ని డిపోలూ లాభాలలోనే నడుస్తున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీ సత్తుపల్లి డిపోను శుక్రవారం సాయంత్రం సందర్శించిన ఆయన.. బస్టాండ్, సైకిల్‌స్టాండ్, గ్యారేజీ, ఖాళీ స్థలాలను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి అధికారులతో సమీక్షించారు. రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులు నడుపుతున్నామన్నారు. ఉద్యోగుల్లో మానసిక ఉల్లాసం నింపేందుకు అన్ని డిపోల్లో ఆటవిడుపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆర్టీసీ అధికారులు విజయశ్రీ, సాహితి, సుబ్బారావు, కాంతారావు, బాలస్వామి, కిన్నెర ఆనంద్, నారాయణ పాల్గొన్నారు.

## బనిగండ్లపాడు కళాశాలలో 'మధ్యాహ్న భోజనం'

భోజనం వడ్డిస్తున్న పూర్వ విద్యార్థులు

ఎర్రుపాలెం, నవంబర్ 29: పూర్వవిద్యార్థులు, దాతలు, కళాశాల సిబ్బంది సహకారంతో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని మండలంలోని బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్వవిద్యార్థులు, గ్రామపెద్దలు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ.. దాతృత్వంతో కొనసాగే ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకార అందించాలని కోరారు. రూ.23 విలువైన సౌండ్‌సిస్టమ్‌ను ఎన్ఆర్ఐ కరుణశంకర్‌రెడ్డి వితరణ చేసినట్లు చెప్పారు.

## 'విద్యార్థులు ఉన్నతస్థాయి లక్ష్యాలు ఎంచుకోవాలి'

బహుమతులు చూపిస్తున్న విద్యార్థులు

ఖమ్మం రూరల్, నవంబర్ 29: విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే ఉన్నప్పుడే ఉన్నతస్థాయికి చేరుకునేలా లక్ష్యాలను ఎంచుకోవాలని ఎంపీడీవో కుమార్ సూచించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లోని విజేతలను శుక్రవారం మండలంలోని ఎంఈవో కార్యాలయంలో శుక్రవారం అభినందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు వెన్నెల, సుధీర్, శైలజలకు బహుమతులు అందజేశారు. ఎంఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 'ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి'

మధిర రూరల్, నవంబర్ 29: విద్యుత్‌ను వినియోగించే క్రమంలో ప్రమాదాల భారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక రైతులకు విద్యుత్ శాఖ అధికారులు సూచించారు. సిద్ధినేనిగూడెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పొలంబాట కార్యక్రమంలో స్థానిక రైతులకు వారు అవగాహన కల్పించారు. విద్యుత్ శాఖ అధికారులు మైథిలి, సత్యనారాయణ, బాబుసాహేబ్, నాగరాజు, కృష్ణ, సూరంశెట్టి నాగభూషణం పాల్గొన్నారు.

## 'బలవర్ధకమైన దూడలే పశు సంపదకు మూలం'

మందులు అందిస్తున్న డాక్టర్

కూసుమంచి (నేలకొండపల్లి), నవంబర్ 29: బలవర్ధకమైన దూడలే పశు సంపదకు మూలమని చెరువుమాధారం పశు వైద్యులు డాక్టర్ సాహిత్య అన్నారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నేలకొండపల్లి మండలం భైరవునిపల్లిలో దూడలు, ఆవులు, గేదెల ప్రదర్శనను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బలవర్ధకమైన లేగ దూడలకు బహుమతులు అంజేశారు. మిగిలిన పశువులు,లేగ దూడలకు బలమైన మందులు అంజేశారు.

## 'నాణ్యమైన విద్యను అందించే బాధ్యత టీచర్లదే'

బోనకల్లు, నవంబర్ 29: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోదా వెంకట నాగమల్లేశ్వరరావు అన్నారు. నూతన ప్రభుత్వం పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి తర్వాత కూడా విద్యార్థుల సంఖ్య తగ్గడం బాధాకరమని అన్నారు. బోనకల్లులో శుక్రవారం జరిగిన సంఘం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 14, 15 తేదీల్లో సత్తుపల్లిలో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## 'మా డబ్బులు మాకివ్వకుంటే ఆత్మహత్యే శరణ్యం'

మామిళ్లగూడెం, నవంబర్ 29: అప్పు తీసుకున్న డబ్బులు ఇవ్వకుంటే ఆత్మహత్య చేసుకుంటామని ఓ వడ్డీ వ్యాపారి ఇంటి ఎదుట దంపతులు నిరసనకు దిగిన ఘటన ఖమ్మంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. ఖమ్మం వీడీవోస్‌కాలనీలో నివాసం ఉంటున్న వ్యాపారి తమ వద్ద నుంచి రూ.2.20 కోట్లు అప్పుగా తీసుకున్నారని తేజావత్ కల్యాణి, పరుచూరి కృష్ణమోహన్ దంపతులు తెలిపారు. రెండేళ్ల క్రితం నోటు రాసి ఇవ్వడంతో పాటు చెక్కులు కూడా ఇచ్చారన్నారు. నాటి నుంచి డబ్బులు అడిగితే వాయిదాలు పెడుతూ వస్తున్నాడని, గట్టిగా అడిగితే కులం పేరుతో దూషిస్తున్నాడని ఆరోపించారు. తమ డబ్బులు తమకు ఇవ్వాలని, లేకుంటే కుటుంబం మొత్తం వ్యాపారి ఇంటి ఎదుట ఆత్మహత్య చేసుకుంటామని వాపోయారు.